


ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22    సంచిక: 54 తిరుపతి    తేది : మంగళవారం 26 మే 2026    పేజీలు : 08 ధర : రూ.6    PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## అలాంటి వారిని నేరాలు చేయాలంటేనే భయపడేలా శిక్షించాలి

- మహిళలు, చిన్నారులపై నేరాల్లో కఠినంగా వ్యవహరించాలన్న సీఎం విజయ్
- తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులను వెంటనే నమోదు చేయాలని ఆదేశం
- దర్యాప్తు వేగవంతం చేసి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్న సీఎం



న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 25

తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల విషయంలో కేసులను తక్షణమే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా

- మిగతా 2లో..

## ఏపీలో 38 కొత్త ఎంఎస్ఎంఈ పార్కులు..

- రూ.200 కోట్లతో క్లస్టర్ల అభివృద్ధి: సీఎం చంద్రబాబు
- విజయవాడలో 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' సమ్మిట్
- 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- మెటా, అమెజాన్, జోహో వంటి దిగ్గజ సంస్థలతో ప్రభుత్వ ఒప్పందాలు
- 45 పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులపై ఉత్తర్వులు
- గ్రామీణ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక కేంద్రాల ప్రారంభం



అమరావతి – ఆంధ్రనాడు, మే 25

రాష్ట్రంలో విస్తృతంగా ఉన్న అవకాశాలను, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సహకాలను వినియో గించుకుని విస్తృతంగా ఎంఎస్ఎంఇలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువతకు పిలుపునిచ్చారు. విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఇ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే


- మిగతా 2లో..

## గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్

- రూ.వంద కోట్ల బడ్జెట్ కేటాయింపు
- పుష్కరాల సన్నద్ధతపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రాజమహేంద్రవరం– ఆంధ్రనాడు, మే 25

గోదావరి నదిలో కాలుష్య నివారణకు అంతర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలను సూచించేలా ఈ టాస్క్‌ఫోర్స్ పని చేయాలని సూచించారు. గోదావరి నది కాలుష్యం నివారణ, పుష్కరాల సన్నద్ధతపై తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గోదావరి నదిని కాలుష్యం నుంచి రక్షించడం అందరి బాధ్యతన్నారు. టాస్క్‌ఫోర్స్ ఇచ్చే నివేదికలు, సూచనలు క్షేత్ర స్థాయిలో వేగంగా



అమలయ్యేలా చూడాలని సూచించారు. గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా రూ.వంద కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నట్టు తెలిపారు. పుష్కరాలు దగ్గరకు వచ్చాక హడావుడిగా టెండర్లు పిలిచి, నాణ్యత లేకుండా తాత్కాలికంగా ఘాట్లు, కట్టడాలు కడితే అవి కూలిపోయి యాత్రికుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో అలాంటి సంఘటనలు చూశామని, మరలా ఆ పరిస్థితులు పునరావృతం

- మిగతా 2లో..

## ఏపీ తీరానికి కొత్త రూపు..

- సమగ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు విజన్ ప్లాన్
- ఏపీ తీరప్రాంత అభివృద్ధికి విజన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశం
- కోస్తా తీరాన్ని ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా మార్చాలని సూచన
- తీరప్రాంత కోతను అరికట్టేందుకు సహజ రక్షణ కవచం ఏర్పాటు
- ఆక్వాకల్చర్‌లో వాల్యూ అడిషన్, వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టాలని నిర్దేశం
- బ్లూ ఎకానమీ, రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగంపై అధ్యయనం చేయాలని స్పష్టం

అమరావతి – ఆంధ్రనాడు, మే 25



ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, ఆర్థిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా మార్చేందుకు ఒక 'విజన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని సముద్ర సంపదను అందిపుచ్చుకుంటూనే, తీర ప్రాంతాన్ని పర్యావరణ హితంగా

- మిగతా 2లో..




## మరీ భావోద్వేగంగా తీసుకోవద్దు

- బొద్దింక వ్యాఖ్యలు వైరల్ పై చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 25

కోర్టులో ఒక కేసు విచారణ సందర్భంగా 'బొద్దింక' అన్న పదం ఉపయోగించడంపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న రచ్చను భావోద్వేగాలపరంగా తీసు కోవద్దంటూ న్యాయవాదిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సోమవారం తెలిపారు. ఈ వ్యాఖ్యలపై స్వయంగా ప్రధాన న్యాయమూర్తే వివరణ ఇచ్చినా కూడా ఇంకా ఆన్‌లైన్‌లో ఆ రభస ఆగకపోవడంపై న్యాయవాది ఎన్.కె. గోస్వామి ఆందోళన వ్యక్తం చేస్తూ పిటీషన్ దాఖలు చేశారు. దానిపై చీఫ్ జస్టిస్ పై రీతిలో స్పందించారు. ఈ నెల 15న ఒక పిటిషన్‌పై

- మిగతా 2లో..

## విశ్లేషకులు వదంతులు మాట్లాడకూడదు

- ప్రశ్నిస్తే.. కులం కార్డు పట్టుకొస్తారా?
- జగన్ జైలుకు వెళ్తే నాకేంటి లాభం? : పవన్ కల్యాణ్

రాజమహేంద్రవరం – ఆంధ్రనాడు, మే 25

విశ్లేషకులు వదంతులు మాట్లాడకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని షెల్టన్ హోటల్ సోమవారం కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... తాను, అమిత్ షా మాట్లాడుకుంటే పక్కన ఉండి విన్నట్టు ఒక విశ్లేషకుడు మాట్లాడారని, అసలు తాము ఏం మాట్లాడుకున్నామో ఎవరికీ తెలియదని, ఊహాజనిత మైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. విశ్లేషణ చేసిన వ్యక్తి అంటే తనకు చాలా గౌరవం అని, ఆయన ఇంట్లో ఒక శుభకార్యానికి కూడా వెళ్లానని తెలిపారు. విశ్లేషణ చేసేటప్పుడు వదంతులు, ఊహాగానాలు తీసుకురాకూడదన్నారు. 'జగన్‌ను జైలుకు పంపాలని



నేను కోరినట్లు చెప్పడంలో ఉన్న లాజిక్ ఏంటో అర్థం కావడం లేదు. జగన్ జైలుకు వెళ్తే నాకు లాభం చేకూరుతుందనడం పిచ్చి లాజిక్. విశ్లేషించే వారిని ప్రశ్నిస్తే.. కులం కార్డును పట్టుకొస్తామంటే ఎలా? ఇష్టానుసారం మాట్లాడితే చేతులు కట్టుకుని కూర్చోవాలా.. మాకు కోపం రాదా?. మేం ఎదురుదాడి చేస్తాం.. మీరు వ్యక్తిగతంగా అంటే.. మేమూ అంటాం. వ్యక్తిగత విమర్శలు చేస్తే.. తామూ ఎదురుదాడి చేస్తాం. ఎక్కడ ఎలాంటి

- మిగతా 2లో..

## మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి గారు!

- లోకేష్ కౌంటర్ - మెగా డీఎస్సీపై జగన్ వ్యాఖ్యలు
- 16 వేల మంది టీచర్లను జగన్ అవమానిస్తున్నారని విమర్శ
- ఎంపికైన అభ్యర్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- త్వరలోనే మరో డీఎస్సీ ఇస్తామని వెల్లడి
- ఉద్యోగాలను అడ్డుకుంటూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపణ



అమరావతి – ఆంధ్రనాడు, మే 25

మెగా డీఎస్సీపై వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్ పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను జగన్ అవమానిస్తున్నారని, వారికి లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. "మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి గారు! మీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చెయ్యలేదు, జాబ్ క్యాలెండర్

- మిగతా 2లో..

## అలాంటి వారిని నేరాలు చేయాలంటేనే భయపడేలా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర సచివాలయంలో శాంతిభద్రతలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల నమోదులో జాప్యం వద్దు.. నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలి

ఈ సమావేశంలో సీఎం విజయ్ మాట్లాడుతూ.. లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో జాప్యం జరగకూడదని అన్నారు. చట్టపరమైన చర్యలను అనుసరించి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నేరగాళ్లకు కఠిన శిక్షలు పడితే, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఇతరులు భయపడతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా దర్యాప్తు సంస్థలు, సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం కూడా చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. సాయికుమార్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. మణివాసన్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్, డీజీపీ డాక్టర్ సందీప్ రాయ్ రాథోడ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళల భద్రతపై ప్రజా స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది.

## గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి

కాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పది కోట్ల మంది యాత్రికులు వస్తారనే అంచనా ఉందని, దీనికి తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలన్నారు. గోదావరి అంటే ఒక్క రాజమండ్రే కాదన్నారు. గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 285 గ్రామ పంచాయతీలను అధికారులు గుర్తించారని, ఆయా గ్రామాల్లోని పుష్కర ఘాట్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. దీని కోసం ఆయా పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తామన్నారు. తొలుత ఆయన రాజమహేంద్రవరం, నిడదవోలు, ధవళేశ్వరంలో పుష్కర ఘాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎంఎల్ఏలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ బత్తుల బలరామకృష్ణ నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

## ఏపీ తీరానికి కొత్త రూపు..

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో సముద్రతీర అభివృద్ధిపై నిపుణులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 'బ్లూ ఎకానమీ' లేదా సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థపై చర్చ జరుగుతోందని, సముద్ర గర్భంలోని అపారమైన వనరులను వెలికితీయడం ద్వారా విస్తృత ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. ఏపీలో ఇప్పటికే ఆక్వాకల్చర్‌ను గణనీయంగా అభివృద్ధి చేశామని, రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని గుర్తుచేశారు. అయితే, కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా ఆక్వా ఉత్పత్తుల్లో వాల్యూ అడిషన్ (విలువ జోడింపు) జరగాలని, తద్వారా రైతులకు, రాష్ట్రానికి మరింత ఆదాయం వస్తుందని నిర్దేశించారు. అదే సమయంలో ఆక్వా వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని, ఈ సవాళ్లను అధిగమించేందుకు పూర్తిస్థాయి అధ్యయనం జరగాలని సూచించారు. తీరప్రాంత అభివృద్ధిలో భాగంగా మెరైన్ బయోడైవర్సిటీని (సముద్ర జీవ వైవిధ్యం) కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సీఎం స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఆ వనరులను అందిపుచ్చుకోవాలని అన్నారు. తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరప్రాంతాన్ని రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని, దీనికోసం మడ అడవులు, తాటి చెట్ల పెంపకం వంటి మూడంచెల సహజ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తీరప్రాంతాలను పర్యావరణ అనుకూల పర్యాటక కేంద్రాలుగా, ఆర్థిక కార్యకలాపాలకు చిరునామాగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సీ వీడ్ (సముద్రపు పాచి) సాగు, దాని మార్కెటింగ్ అవకాశాలను కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయ నం నిర్వహించి, పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు రావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ ప్రతినిధి ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

## మరీ భావోద్వేగంగా తీసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

విచారణ సందర్భంగా భారత యువతను ప్రస్తావిస్తూ సిజె ఈ బొద్దింకలు అన్న పదాన్ని ఉపయోగించిన సంగతి తెలిసిందే. దానిపై ఆన్‌లైన్ వేదిక అయిన కాక్రోచ్ జనతా పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది.. దానిపై ఆ మరునాడే చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ వివరణ కూడా ఇచ్చారు. తనకు దేశ యువత పట్ల చాలా గౌరవం వుందని, కానీ తాను చేసిన వ్యాఖ్యలను మీడియాలోకి కొంత మంది తప్పుగా ఉటంకించాయని వివరణ ఇచ్చుకున్నారు. 'డిజిటల్–రాజకీయ నిర్మాణమైన కాక్రోచ్ జనతా పార్టీ కార్యకలాపాలపై దర్యాప్తు కోరుతూ సుప్రీం లాయర్ వేసిన పిటిషన్‌ను విచారణకు చేపట్టాల్సిన అత్యవసరం ఏమీ లేదని ప్రధాన న్యాయమూర్తి సోమవారం వ్యాఖ్యా నించారు. పిటిషనర్, అడ్వకేట్ రాజా చౌదరి ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సిబిఐలను ప్రతివాదులుగా చేర్చారు.

## ఏపీలో 38 కొత్త ఎంఎస్‌ఎంఈ పార్కులు..

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, యువత కలలకు, మహిళల ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోందని చెప్పారు. దీనికి తగ్గట్టుగా కొత్త ఆలోచనలతో రావాలని అన్నారు. రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. త్వరలో 5 లక్షల మంది డ్వాక్రా మహిళల్ని ఎంట్రపెన్యూర్‌లుగా తీర్చిదిద్దుతామన్నారు. మహిళా సంఘాల వద్ద ప్రస్తుతం 28 వేల కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ ఉందని, ఆ సంఘాలద్వారా 100 యూనికార్న్ కంపెనీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జెన్ జీ యువత కలల్ని సాకారం చేస్తాం మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తు, ఉపాధికి, నైపుణ్యాలకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. జెన్– జి , జెన్– ఆల్ఫా, టీనేజర్లకు మేలు కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్నది ప్రభుత్వ విధానమన్నారు. ఇంటికో ఔత్సాహిక పారిశ్రామికవేత్త రావాలంటే ఇకపై మరో కోటి ఎంఎస్ఎంఇలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఇందుకోసం అన్ని చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులను ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తు న్నామని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా ఎంఎస్ఎంఇ రంగం ఉందని, భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధిని కలిగిస్తాయని అన్నారు. రాష్ట్రంలో వనరులకు, అవకాశాలకు కొదవ లేదని, వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎం ఇలకు అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా అందుబాటులో ఉన్నాయని. ఈ సదస్సు కొత్త ఆవిష్కరణలకు వేదిక కావాలని పిలుపునిచ్చారు.

**38 ఎంఎస్ఎంఇ పార్కులకు శంకుస్థాపన**

ఈ సందర్భంగా 38 ఎంఎస్ఎంఇ పార్కులకు సిఎం శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయన్నారు. మిగిలిన వాటిని జూలై నాటికి శంకుస్థాపనలు చేసి అన్ని మౌలిక వసతులూ కల్పిస్తామని చెప్పారు.

**భారీ ఒప్పందాలు**

ఆర్టీఐహెచ్ ఆధ్వర్యంలో నడిచే రూరల్ అవుట్ పోస్టులను కూడా సీఎం ఆవిష్కరించారు. మంగళగిరి, పిఠాపురం, కుప్పంలో రుటాగ్ ఈ స్మార్ట్ విలేజ్ సెంటర్లను పైలట్ గా ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంక్యుబేషన్ కేంద్రాలుగా ఈ ఆర్ఎస్వీ కేంద్రాలు పనిచేయనున్నాయి. ఆర్టీఐహెచ్ తో కలిసి కియా ఇండియా సంస్థ అడ్వాన్స్ ప్రోటో టైపింగ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. వివిధ స్టార్టప్ లకు చేయూత ఇచ్చేలా హై ఎండ్ ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్ ప్రోటోటైపింగ్ ఫెసిలిటీని కియా ఏర్పాటు చేయనుంది. డీప్ టెక్ స్టార్టప్ లకు ఆర్థిక సహకారం అందించేలా ఆర్టీఐహెచ్ తో కలిసి సిడ్బీ రూ.20 కోట్ల సీడ్ ఫండ్ ప్రోగ్రామ్ ను కూడా ప్రారంభించనుంది. దీనికి సంబంధించి సిడ్బీ బ్యాంక్ ముందుకు వచ్చింది. రాష్ట్రంలో 1 లక్ష మంది ఎంఎస్ఎంఈ డిజిటల్ మెచ్యూరిటీ అసెస్మెంట్ లో భాగంగా వివిధ కళాశాలల్లో 50 డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ -- ఐటీ శాఖల మధ్య ఒప్పందం కుదిరింది. వీటితో పాటు వెయ్యి ఎంఎస్ఎంఈ ఎనర్జీ, వాటర్ ఆడిట్స్, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ లో డయాగ్నొస్టిక్స్ నిర్వహించేందుకు ఎస్సెల్ సంస్థ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని 750 ఎంఎస్ఎంఈ లతో పాటు 3,125 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రూ.200 కోట్ల వ్యయంతో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం చేపట్టాలని నిర్ణయించారు. దివ్యాంగ యువతకు ఎంట్రప్రెన్యూర్ షిప్ ట్రైనింగ్ ఇచ్చేలా కార్యాచరణ చేపట్టను న్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డీబీవీ స్వామి సహా ప్రజాప్రతినిధులు, ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పోరేషన్ సిఇఓ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**అంబేద్కర్ కళా వేదిక ప్రారంభం**

అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెన్షన్ సెంటర్ నిర్మించటం ఆనందకరమన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్లు సీఎం వెల్లడించారు.

## విశ్లేషకులు వదంతులు మాట్లాడకూడదు

(మొదటి పేజీ తరువాయి)

గొడవలు పెట్టుకుంటారో చెప్పండి.. నేను సిద్ధం. ఛాయిస్ మీకే ఇస్తున్నా.. అంతేగానీ నన్ను రెచ్చగొట్టొద్దు'. అని వ్యాఖ్యానించారు. ?సగటు మనిషి తన హక్కులు సాధించుకోవాలంటే పోరాటం తప్పని సరన్నారు. జనసేన నేతలకు పదవులు ఇస్తే ఉత్సాహంగా పనిచేస్తారనుకుంటే.. మాట్లాడటం మానేశారని, పదవులు ఇవ్వగానే అందరూ పెద్దమనుషులు అయ్యారని, పదవుల కోసమే అయితే జనసేనలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. తమిళనాడులో అభిమానులందరూ ఏకతాటిపై ఉంటారని, ఆంధ్రప్రదేశ్‌లో సినిమాపరంగా అభిమానులంటరే తప్ప రాజకీయాలకు వచ్చే సరికి కులం అడ్డు వస్తోందన్నారు. తన మనసులో 'నా కులం' అనే స్వార్థం లేదని, కేవలం 'మనం మనుషులం' అనే భావనే ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడమే తనకు ఇష్టమని, సినిమాల్లో ఆస్కార్ సంపాదించడం కాదని, 70 ఏళ్లుగా రోడ్డు లేని ఊరికి రోడ్డు వేస్తే, అది నాకు ఆస్కార్ కొట్టినంత ఆనందంగా ఉంటుందన్నారు. పార్టీ ముందుకు వెళ్లాలంటే అందరకూ ఒక్క మాటపైనే ఉండాలని, ఆగస్టు 14 నాటికి సంస్థాగత కమిటీలన్నింటినీ పూర్తి చేయాలన్నారు.

## ఎఐఎస్ బంగ్లాలలో మంత్రి నారాయణ పరిశీలన

తుళ్లూరు – ఆంధ్రనాడు, మే 25



భవిష్యత్తులో అమరావతి ద్వారా ఏటా రూ 12 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి నారాయణ చెప్పారు. మిగులు 5 వేల ఎకరాలతో రుణాలు చెల్లిస్తామన్నారు. రాజధాని అమరావతిలోని రాయపూడితో నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారులు,ఐకానిక్ టవర్ల నిర్మాణాలను మంత్రి సోమవారం రాత్రి పరిశీలించారు. అమరావతి నిర్మాణంపై వైసిపి వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ లెక్కలను తప్పుగా చెబుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జనం నవ్వుకుంటున్నా..మావిగన్ అంటూ పట్టుకుని వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాత్రి వేళలో శరవేగంగా జరుగుతున్న అమరావతి నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి చెప్పారు. ఐఏఎస్ అధికారుల కోసం నిర్మిస్తున్న 6 టవర్స్‌లో చాలా వరకు పనులు పూర్తయ్యాయని,జూన్ నుంచి దశలవారీగా భవనాలను జీఏడీకి అప్పజెపుతామని చెప్పారు.మొత్తం 30,760 మంది రైతులు 35,059 ఎకరాలు భూములను రాజధాని నిర్మాణానికి ఇచ్చారని, అందులో 30,079 మంది రైతులకు ఇప్పటికే ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇంకా కేవలం 681 మంది రైతులకు చెందిన 524 ఎకరాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మొత్తం 63,342 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందని,7,482 రిజిస్ట్రేషన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని అన్నారు.అమరావతి నిర్మాణ పురోగతి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. వైసిపి నాయకులు మాట తీరు మార్చుకోకపోతే 11 సీట్లు కాస్తా సున్నా అవుతాయని అన్నారు.హైదరాబాద్ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ వ్యయాలపై పూర్తి డేటాతో మాట్లాడాలన్నారు. హైదరాబాద్‌లో సచివాలయం చదరపు అడుగుకు 13,768 ఖర్చు అయ్యిందని,పార్లమెంట్ నిర్మాణానికి చదరపు అడుగుకు 16,916 ఖర్చు అయిందని అన్నారు.అమరావతి ఐకానిక్ టవర్స్‌కు చదరపు అడుగుకు రూ15,000 నుంచి రూ 16,000 ఖర్చు అవుతోందన్నారు.

## మెగా డిఎస్‌సినా? దగా డిఎస్‌సినా?

### -- పేపర్లు లీక్.. డేటా డిలీట్..- మెరిట్ లిస్టు మాయం

### -- వైసిపి అధినేత వైఎస్ జగన్

అమరావతి – ఆంధ్రనాడు, మే 25



కూటమి ప్రభుత్వం నిర్వహించింది మెగా డిఎస్‌సినా? దగా డిఎస్‌సినా? పేపర్లు లీకు, డేటా డిలీట్ అయ్యాయని, మెరిట్ లిస్టు మాయమైందని, దీనిపై ముఖ్యమంత్రి ఏమి సమాధానం చెబుతారు? అని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో సోమవారం స్పందించారు. వైసిపి హయాంలో ఇచ్చిన డిఎస్‌సిని రద్దుచేసి, ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసి, కొత్తగా మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి దాన్ని పబ్లిసిటీకి వాడుకున్నారని తెలిపారు. తీరా పరీక్షల్లో చేసిన నిర్వాకాలు, స్కామ్‌లతో ఉద్యోగార్థులకు ద్రోహం జరిగిందని పేర్కొన్నారు. విద్యాశాఖలో లీకులతో సాగిన 'డార్క్ ఆపరేషన్'ను ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఎస్‌సిఇఆర్‌టి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆ తర్వాత ఆ వివరాలను డేటాబేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారు? మెరిట్ లిస్టులను ఎందుకు దాచారు? టాపర్ వివరాలను ఎందుకు తొలగించారో బయటపెట్టాలన్నారు. ఎంపికైన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు ఎందుకు పంపారు? కలెక్టర్ కార్యాలయాల్లో ఎంపికైన వారి జాబితాలు ఎందుకు పెట్టలేదు? అని ప్రశ్నించారు. రూ.15 లక్షలకు 'స్పోర్ట్స్ కోటా' పోస్టుల బేరసారాలాడారని, ఎప్పుడూ క్రీడా మైదానంలో అడుగుపెట్టని వాళ్లకి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఇంటికే పిలిచి ఒప్పందాలు కుదిర్చారని, రిక్రూట్‌మెంట్‌ను వేలం పాటలా మార్చేశారని వివరించారు. ఇలా జరిగితే ప్రతిభ ఉన్నవారి మాటేమిటో సమాధానం చెప్పాలని కోరారు. టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారే డిఎస్‌సి పరీక్షకూ కన్వీనర్ అయినప్పటికీ, ఉన్నపళంగా టెట్ కన్వీనర్‌ను తొలగించి విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌ను డిఎస్‌సి కన్వీనర్‌గా పెట్టడం వెనుకు మతలబు ఏమిటన్నారు. దీనికి సంబంధిత శాఖ మంత్రి బాధ్యత వహించాలని, సిబిఐ దర్యాప్తును కోరాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో చిత్తశుద్ధి ఉంటే ప్రతిభ చూపిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

## మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి గారు!

(మొదటి పేజీ తరువాయి)

ఊసేలేదు.మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. త్వరలోనే మరో డీఎస్సీ కూడా ఇవ్వబోతున్నాం. మరింత బిగ్గరగా ఏడవడానికి సిద్ధంగా ఉండండి జగన్ గారూ! మీరు టెన్త్ పేపర్లు ఎత్తుకెళ్లిన దొంగ అని, అందరూ అలాగే ఉంటారనుకోవడం చాలా పెద్ద నేరం. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో, నిద్రాహారాలు మాని, చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన 16 వేల మందిని మీరు అనుమానిస్తున్నారు, అవమానిస్తున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లు అందరికీ జగన్ గారు లెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలి. మెగా డీఎస్సీ ఆపాలని 200 కేసులు, గూగుల్, టీసీఎస్ రాకుండా కోర్టులో కేసులు వేయించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు లేకుండా వారి భవిష్యత్తు నాశనం చేయాలని చూస్తున్న జగన్ గారూ మిమ్మల్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరు" అంటూ లోకేష్ ఘాటుగా స్పందించారు.

# అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**శాంతిపురం – ఆంధ్రనాడు, మే 24:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (ఐ.సి.డి.యస్) శాంతిపురం ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్వాడీ కార్యకర్త స్థానాలు, 34 హెల్పర్ ఉద్యోగాల ఖాళీస్థానాలు భర్తీ చేయుటకు చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారు. శాంతిపురం మండల పరిధిలో 2 కేంద్రాలకు అంగన్వాడీ కార్యకర్తలు,15 కేంద్రాలకు అంగన్వాడీ హెల్పర్లు అలాగే రామకుప్పం మండల పరిధిలో 1 కేంద్రానికి అంగన్వాడీ కార్యకర్త,19 కేంద్రాలకు అంగన్వాడీ హెల్పర్లు అవసరం ఉందని తెలిపారు.ఇందుకు అంగన్వాడీ కేంద్ర గ్రామ వార్డు పరిధిలో నున్న ఆసక్తిగల స్థానిక 10వ తరగతి పాస్ అయిన వివాహిత మహిళలు నిర్దేశిత రోస్టర్ ననుసరించి 23వతేదీ నుంచి స్థానిక సి.డి.పి.ఓ. శాంతిపురం కార్యాలయమునందు దరఖాస్తులను అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రములను జతచేసి జూన్ నెల 3వ తేదీ సాయంత్రం 5.00 గం.లోపు సమర్పించాలని తెలిపారు. నిర్ణీత సమయం తరువాత వచ్చిన దరఖాస్తులు పరిశీలించబడవు అని మరింత సమాచారం కొరకు శాంతిపురం సి.డి.పి.ఓ. కార్యాలయమును సంప్రదించాలని తెలిపారు.

# 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి.. ఏపీ ఎమ్మెస్ఆర్‌యూ

**- తిరుపతి కలెక్టరేట్ వద్ద గెజిట్ ప్రతుల దగ్ధం**
**- కార్మిక వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25:** కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే పోరాటాలు తీవ్రతరం చేస్తామని ఏపీ ఎమ్మెస్ఆర్‌యూ రాష్ట్ర కార్యదర్శి టి.రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏపీ ఎమ్మెస్ఆర్‌యూ ఆధ్వర్యంలో లేబర్ కోడ్స్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో సంప్రదింపులు లేకుండానే నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు సిద్ధమవడం అప్రజాస్వామికమని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. పని గంటలు పెంచడం, నిరసనలపై ఆంక్షలు విధించడం, ఉద్యోగ భద్రత తగ్గించడం వంటి చర్యలు కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేస్ గాంధీ, సీఐటీయూ నాయకులు జి.బాలసుబ్రమణ్యం, మాధవ్, వేణు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# రాగిగుంట భూములు పేదలకు ఇవ్వాలి

**- 250 ఎకరాల ప్రభుత్వ భూమి పంపిణీకి గ్రామస్తుల డిమాండ్**
**- కలెక్టరేట్ ఎదుట ధర్నా.. డీఆర్వోకు వినతిపత్రం**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25:** కేవీబీ పురం మండలం రాగిగుంట గ్రామంలోని 250 ఎకరాల ప్రభుత్వ భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సుమారు 40 మంది గ్రామస్తులు ధర్నా నిర్వహించి డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నంబర్ 358లో ఉన్న ప్రభుత్వ భూములను పలుకుబడి ఉన్న కబ్జాదారుల నుంచి రక్షించి, ప్రతి భూమిలేని కుటుంబానికి రెండెకరాల చొప్పున కేటాయించాలని వారు కోరారు. కొందరు రాజకీయ అండదండలతో భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# రాయలపేటలో సైదానీమా బీబీ సాహెబ్ ఉరుసు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 25 :** మండలంలోని రాయలపేటలో సైదానీమా బీబీ ఉరుసు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన గంధం మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైఎస్ఆర్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుహేబ్, మండల వైస్ ఎంపీపీ జీడీ బాబు, మండల మేథావుల సంఘం అధ్యక్షులు గురునాథరెడ్డి, వైఎస్ఆర్సీపీ మండల మైనార్టీ విభాగ నాయకులు ఇమామ్‌వాలి , హామద్ బాషా , హసేన్ బాషా ,దర్గా కమిటీ సభ్యులు మదనపల్లి బావాజాన్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ గంధ మహోత్సవం సందర్భంగా పూలతో అలంకరించిన లారీతో నిర్వహించిన ఊరేగింపు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలో అధిక సంఖ్యలో హిందూ, ముస్లిం సోదరులు పాల్గొని సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

# ట్రాక్టర్ ప్రమాద బాధిత ఉపాధి కూలీలకు న్యాయం చేయాలి

**- మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్**
**- కలెక్టరేట్ వద్ద నిరసన, పీజీఆర్ఎస్‌లో వినతి**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25 :** ఉపాధి పనులకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన కూలీల కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని సీఐటీయూ తిరుపతి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ నందు నిరసన చేపట్టి అనంతరం సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ నందు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, బాధిత కుటుంబాలు మాట్లాడుతూ, రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలం వెలగచేర్ల చెరువు కట్ట సమీపంలో గత నెల 16న ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు కూలీలు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ట్రాక్టర్‌లో మొత్తం 54 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో పి. పెంచలయ్య, కె. వెంకటయ్య మృతి చెందగా, మరో 52 మంది తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ప్రమాదం అనంతరం సంబంధిత అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధితులను పట్టించుకోలేదని ఆరోపించారు. మృతులు అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందినవారని, ఇప్పటి వరకు ప్రభుత్వ సహాయం అందలేదని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన పలువురికి కాళ్లు, చేతులు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం అవసరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారం, గాయపడిన వారికి ఆర్థిక సాయం అందించడంతో పాటు వారు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వ పరంగా అండదండలు కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. జయచంద్ర, టి. సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

# జాతీయ స్థాయి సాహితీ పురస్కారాన్ని అందుకున్న ఎంపీడీఓ బాలాజీ

**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 25:** జీవితం యాంత్రికంగా మారిపోయి మనుషుల మధ్య మాటలు కరువవుతున్న పరిస్థితిలో, మానవ సంబంధాల సంరక్షణ, మానవ జీవితంలోని విలువైన అనుభూతులు, జ్ఞాపకాల పరిరక్షణ, భూమిని, ప్రకృతిని కాపాడుకోవడం, ఉత్తమ సమాజ నిర్మాణం ప్రధానంగా కొనసాగిన కవిత్వం"లోపలేదో కదులుతున్నట్టు" అని పురస్కార ప్రధానోత్సవ నిర్వాహకులు పి.శ్రీనివాసగౌడ్, జీవి రత్నాకర్, డాక్టర్ జెల్ది విద్యాధర్ తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీలో అత్యుత్తమ కవితా సంపుటిగా ఎంపికైన"లోపలేదో కదులుతున్నట్టు" కు గాను శనివారం రాత్రి హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఏటూరి వెంకయ్యానాయుడు శకుంతల స్మారక జాతీయ సాహిత్య పురస్కారాన్ని కవి, రచయిత, సాహిత్య విశ్లేషకులు, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ అందుకున్నారు. కవి గాయకుడు, వాగ్గేయకారుడు తెలంగాణ శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న, ఎస్ వి యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షత వహించిన ఈ పురస్కార ప్రదానోత్సవ సభలో సుప్రసిద్ధ సాహితీవేత్తలు యాకూబ్, నాళేశ్వరం శంకరం, శీలాసుభద్రా దేవి, వంగాల సంపత్ రెడ్డి, సుంకోజి దేవేంద్రాచారి, కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం ఈస్తటిక్స్ జాతీయ సాహిత్య పురస్కారం తర్వాత జాతీయ స్థాయిలో మరో పురస్కారాన్ని కూడా తన కవిత్వానికి పలమనేరు బాలాజీ అందుకోవటం పట్ల రచయితల సంఘాలు, సాహిత్య సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు ప్రశంసించారు.



# ఘనంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 25 :** మండలంలోని రాయలపేటలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చిన్ననాటి సంఘటనలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు తమ జీవిత ప్రయాణం, ఉద్యోగ రంగాల్లో సాధించిన విజయాలను పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని పలువురు సంకల్పించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గురువులు కూడా విద్యార్థులను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ, జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక ఆటలు, జ్ఞాపకాల పంచిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాత ఫోటోలను ప్రదర్శిస్తూ విద్యార్థులు ఆనందంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కాలం దూరం చేసినా స్నేహం మళ్లీ కలిపింది అంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనం జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని పాల్గొన్నవారు తెలిపారు.



# చిరు వ్యాపారులకు అండగా సిఐటియు

**- జెసిబీలతో బండ్లు ధ్వంసం చేయడం అమానుషమని ఆగ్రహం**
**- నష్టపరిహారం చెల్లించి యథాస్థానాల్లో వ్యాపారాలకు అవకాశం కల్పించాలని డిమాండ్**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25:** అలిపిరి ప్రాంతంలో దశాబ్దాలుగా తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల బతుకులపై జెసిబీలు నడిపి జీవనాధారాన్ని ధ్వంసం చేయడం దారుణమని సిఐటియు నాయకులు మండిపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బుజ్జి అధ్యక్షతన భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి. బాలసుబ్రమణ్యం, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్. లక్ష్మి, నగర ప్రధాన కార్యదర్శి ఎం.మాధవకృష్ణ, నగర ఉపాధ్యక్షుడు కే. వేణుగోపాల్ మాట్లాడుతూ, శనివారం ఉదయం భారీ సంఖ్యలో పోలీసులు, మున్సిపల్ అధికారులు, ప్రత్యేక బలగాలు జెసిబీలు, ట్రాక్టర్లతో అలిపిరి వద్దకు చేరుకుని ముందస్తు సమాచారం లేకుండా తోపుడుబండ్లను ధ్వంసం చేసి, సామాగ్రిని ట్రాక్టర్లలో తరలించారని ఆరోపించారు. ఈ చర్యను అడ్డుకునేందుకు వచ్చిన మహిళలు, వృద్ధులను సైతం తోసిపడేసి దాడి చేశారని, ఒక మహిళా వ్యాపారికి చేయి విరిగేలా దాడి జరగడం బాధాకరమని పేర్కొన్నారు. అలిపిరి నుంచి జూపార్క్ వరకు నాలుగు దశాబ్దాలుగా పేద చిరు వ్యాపారులు శ్రీవారి భక్తులకు తక్కువ ధరలకు ఆహారం, పండ్లు, పూజా సామగ్రి అందిస్తూ సేవ చేస్తున్నారని తెలిపారు. ఉపాధి అవకాశాలు లేక అప్పులు తెచ్చుకుని స్వయం ఉపాధి పొందుతున్న పేదలపై జెసిబీలు నడపడం తగదన్నారు. నగరంలో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, పేద చిరు వ్యాపారులపై మాత్రమే చర్యలు తీసుకోవడం వివక్షపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈట్ ఫుడ్ సెంటర్‌కు లాభం చేకూర్చేందుకే ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధ్వంసమైన తోపుడుబండ్లు వెంటనే అప్పగించాలని, వాటికి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని, గతంలో మాదిరిగానే అదే ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓ నరసింహులుకు పీజీఆర్ఎస్ నందు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు పి.మునిరాజ, పి.రమేష్, ఆనంద్, మురళి, సురేష్, విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేణిగుంటలో చెత్తాచెదారం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 25:** మండల కేంద్రమైన రేణిగుంట పట్టణంలో పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్ల పై జనజీవనానికి ఇబ్బందికరంగా మారింది. గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, కార్మికులు గత రెండు రోజులుగా తమ విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తాచెదారం తొలగించకపోవడంతో, స్వచ్ఛభారత్ కార్యక్రమం సిగ్గుపడేలా మారింది. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# మెరిట్ విద్యార్థులకు ఎమ్మెల్యే సన్మానం

**- ప్రభుత్వ బడుల ప్రతిభకు ప్రశంసలు**



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 25:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యారంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ కొత్త ప్రమాణాలు సృష్టిస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 30 మంది విద్యార్థులను సోమవారం ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా మారుతున్నాయని, ప్రైవేట్ విద్యాసంస్థలతో సమానంగా కాకుండా వాటికంటే మెరుగైన ఫలితాలు సాధిస్తూ ప్రభుత్వ బడుల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు అవుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు ఆధునిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు కొత్త దిశగా అడుగులు వేస్తున్నాయని చెప్పారు.అనంతరం బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సాయిబాబా ఆలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చేతుల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య గురించి ప్రజలకు వివరించారు.తదుపరి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించడంతో పాటు, గ్రీవెన్స్ కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీపతి,రవికుమార్, తెదేపా నాయకులు మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, యువ నాయకుడు పాలమంగళ రమేష్,బాలాజీ,ఉపాధ్యాయులు అధికారులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు రైతులను సిద్ధం చేయండి...

**- వ్యవసాయ సిబ్బందికి మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ సూచన**

**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 25:** మండలంలోని రైతులను రానున్న ఖరీఫ్ సీజన్‌కు



ముందుగానే సిద్ధం చేసి, వారికి అవసరమైన సూచనలు, సలహాలు, సాంకేతిక సహాయం అందించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వ్యవసాయ సహాయక సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు గ్రామ స్థాయిలో చేపట్టాలని సూచించారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులు, నేల సార పరీక్షల ప్రాధాన్యత, ఎరువుల సమతుల వినియోగం, విత్తనాల ఎంపిక వంటి అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే మట్టి నమూనాల సేకరణను వేగవంతం చేసి, రైతుల భూసార పరీక్షల ద్వారా తగిన సూచనలు అందించాలని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న వివిధ వ్యవసాయ యాప్‌లు, ప్రభుత్వ సేవలు, రైతు ధృవపత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారికి అవసరమైన సహకారం అందిస్తూ ఖరీఫ్ సీజన్ విజయవంతం అయ్యేలా కృషి చేయాలని వ్యవసాయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# మిగులు భూములను పేదలకు పంచి జీవనోపాధి మెరుగుపరచండి : గ్రామీణ పేదల సంఘం డిమాండ్



**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 25:** చంద్రగిరి మండలంలోని మిగులు ప్రభుత్వ బంజర భూములను పేదలకు పంచి, వారి జీవనోపాధిని మెరుగుపరచండని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామీణ పేదల సంఘం చంద్రగిరి శాఖ వారు డిమాండ్ చేశారు. చంద్రగిరి మండల తాశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తాశీల్దార్ కు చంద్రగిరి పేదల సంఘం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపాకం పంచాయితీ పరిధిలోని పాకాల వారి పల్లి, బోడిగుట్ట వారి పల్లి, పనపాకం దళితవాడ, కోనంగి వారి పల్లి, అంబేద్కర్ కాలనీ, తదితర గ్రామాలలో ఎక్కువ సంఖ్యలో భూమిలేని నిరుపేదలు నివసిస్తున్నారని చెప్పారు. వారు రోజు కూలీలుగా పనిచేసుకుంటూ దుర్బల పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, ఎక్కువ మందికి రోజువారి జీవనం గడవడం కూడా ఎంతో కష్టంగా ఉందన్నారు. మరి కొంతమంది చిన్నపాటి వ్యవసాయ భూములు కలిగి ఉండినా పంటలు పండించలేక పండించిన సరియైన గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని తెలిపారు. మండలంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ బంజరు భూములు ఉన్నాయని వాటిని గుర్తించి భూములు లేని నిరుపేదలకు పంచి వ్యవసాయం చేసుకొని ఎందుకు ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా కొద్దిపాటి వ్యవసాయ భూములు కలిగిన వారికి పంట సాగుకు అవసరమయ్యే మొత్తాలను అందించాలని డిమాండ్ చేశారు. పేదవారిని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. పేదవారికి న్యాయం జరిగే వరకు పేదల సంఘం చంద్రగిరి వారు ఉద్యమం చేయనున్నట్లు ప్రకటించారు. వినతి పత్రం అందించిన వారిలో పేదల సంఘం కన్వీనర్ ప్రభాకర్, కార్యదర్శి భాస్కర్, పలువురు నిరుపేదలు, మహిళలు వున్నారు.

# సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు అండగా నిలుద్దాం

**- ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన**



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 25:** మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి అండగా నిలుద్దామని తాశీల్దారు మధుసూదన్ రావు అన్నారు. తాశీల్దారు అధికారులతో కలిసి సోమవారం తన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలపై ప్రజలు 10 వినతిపత్రాలు ఇచ్చారని తాశీల్దారు తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూముల రీ సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండల ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం మనందరి పైన ఉందని అధికారులతో అన్నారు.



తాశీల్దారు కార్యాలయం ఆవరణలో కమ్మపల్లి ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి హాజరైన ప్రజలుకు డాక్టర్ జయ శంకర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామని వైద్యాధికారి డాక్టర్ జయ శంకర్ చెప్పారు. వేసవి తాపం ఎక్కువగా ఉండటం వలన వడదెబ్బకు గురి కాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో ఆయన వివరించారు. ప్రజలు ఎండకు ముందుగానే పనులు ముగించుకుని ఇంటికి చేరితే మంచిదన్నారు. వీలైనంత ఎక్కువగా నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, ఎంపీడీవో పులిరాం సింగ్, డిప్యూటీ తహశీల్దార్ ఎం అన్వర్ భాష, డిప్యూటీ సర్వేయర్ తరుణ్, ఎంఈఓవి మార్కండేయ నాయుడు, డిప్యూటీ ఎంపీడీవో తేజోవతి, వ్యవసాయ శాఖ అధికారిణి మమత, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో త్వరలో అందుబాటులోకి పోస్టుమార్టం సేవలు - డీసీహెచ్ఎస్ లక్ష్మీ ప్రసాద్



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 25:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంచాలని డీసీహెచ్ఎస్ లక్ష్మీ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం తంబళ్లపల్లి సీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఓపిల సంఖ్య, ఇన్ పేషంట్ల సంఖ్య,జనరల్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, బాలింతల వార్డు తదితర విభాగాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. నూతన ఆసుపత్రి భవనంలో నిర్వహిస్తున్న ఓపీడీని తిరిగి పాత భవనంలోకి మార్చాలని సూచించారు. నూతన భవనంలో ఏమర్జెన్సీ కేసులు, ఇన్ పెషేంట్లు, గర్భవతులు, బాలింతల వార్డుకు కేటాయించాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో వున్న వైద్యులు నెలకొన్న సమస్యల గురించి వైద్యాధికారి తేజస్వితో ఆరా తీశారు. ఆసుపత్రిలో పీడియాట్రిషన్, జనరల్ సర్జన్ వైద్యుల కొరత, పోస్టు మార్టం గది నిర్మాణం పూర్తయి, సిబ్బందిని కేటాయించినా సేవలు అందుబాటులోకి తేకపోవడం, ఆక్సిజన్ ప్లాంట్ పూర్తయి నాలుగేళ్లకు పైగా గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాకపోవడాన్ని మీడియా ప్రతినిధులు డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, అందించాల్సిన సేవలను బట్టి వైద్యులను కేటాయించడం జరుగుతుందన్నారు. పోస్టుమార్టం గదికి విద్యుత్ కనెక్షన్ తో పాటు నీటి సమస్య ఉందని తొందర్లోనే పరిష్కరించి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. చాలా చోట్ల ఆక్సిజన్ ప్లాంట్లు పూర్తయినా కొన్ని మరమ్మత్తు పనుల కారణంగా ప్రారంభం కాలేదని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వస్తూనే పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. వైద్య సేవల కోసం వచ్చే ఇన్ పెషేంట్లకు మూడు పూటలా భోజనానికి రూ. 78లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే ప్రభుత్వాసుపత్రిల్లో ప్రసవం కోసం వచ్చే ప్రభుత్వం చిక్కీ, కోడిగ్రుడ్డు, భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తేజస్వి, వైద్యులు ఆశాలత, సుమలత, హెడ్ నర్సు గ్లోరీ, స్టాఫ్ నర్సు వాణి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.



# జన్మదిన శుభాకాంక్షలు



నాగలాపురం – ఆంధ్రనాడు, మే 25: తిరుపతి పట్టణంలోని కె.ఎస్.ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం సత్యవేడు నియోజకవర్గం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి. శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పుట్టిన రోజు జరుపుకున్న నాగలాపురం మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఉత్తమ కార్యకర్త, మాజీ క్లస్టర్ ఇన్చార్జి, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి యం.డి. కుమార్ కు దుస్సాలువతో సన్మానించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మవారిని సేవలో కేంద్ర మంత్రి



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 25:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద కేంద్ర మంత్రికి ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ సురేష్, ముని చంగల్రాయులు, రమేష్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, చలపతి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఫై విద్య సంస్థ అధినేత ప్రణీత్, బడి సుధా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలియేటివ్ కేర్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 25:** సోమవారం తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్ వి వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఎస్ వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహర్, ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం మే 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు "పాలియేటివ్ కేర్ శిక్షణ కార్యక్రమం" నిర్వహించబడుతోంది ఈ సందర్భంగా ఆయన తెలిపారు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు,వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక ఆదేశాల మేరకు, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు, రాష్ట్ర నోడల్ అధికారుల పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్య క్రమంలో నెల్లూరు, కడప, ఆత్మకూరు, ప్రొద్దుటూరు, మదనపల్లి తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి వైద్య అధికారులు, అనస్థీషియా వైద్యులు, ఫిజిషియన్లు, నర్సింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మొత్తం సుమారు అరవై మంది వైద్య సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరై పాలియేటివ్ కేర్ సేవలపై ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.పాలియేటివ్ కేర్ రంగంలో హోమి బాబా వద్ద శిక్షణ పొంది, అనుభవం కలిగిన డాక్టర్ కె. రోజారమణి, డాక్టర్ కరుణ, డాక్టర్ అనువేష్, డాక్టర్ భారతి తదితర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొనేవారికి సమగ్ర శిక్షణ అందిస్తున్నారు.

రోగుల జీవితాంత సంరక్షణలో మానవీయ దృక్పథం, నొప్పి నియంత్రణ, మానసిక ధైర్యం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాలియేటివ్ కేర్ సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రాంతీయ, బోధనా ఆసుపత్రుల వరకు విస్తరించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఈ శిక్షణ తీసుకునే సిబ్బంది పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో వీరు ముందడుగు వేస్తారని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ బి మనోహర్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం లో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రుయా ఆస్పత్రి రిటైర్డ్ సూపరిటెండెంట్ డాక్టర్ టీ భారతి, ఏ ఆర్ ఎం ఓ డాక్టర్ హరికృష్ణ, వైద్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, తదుతరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ఎంఎస్ఎంఈల ద్వారా ఉపాధి అవకాశాల పెంపు
- పెట్టుబడులకు ప్రోత్సాహం
- రూ.64 లక్షల సబ్సిడీ ఆమోదం
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25:** రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని, నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనతో పాటు పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరిశ్రమల శాఖ అధికారులు సమర్థవంతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. అలాగే పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఎఈపిసి) సమీక్ష సమావేశం వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సింగిల్ డెస్క్ విధానం ద్వారా మార్చి 2026 వరకు 1681 పరిశ్రమలకు గాను 1641 అనుమతులు జారీ చేయబడినట్లు తెలిపారు. ఇంకా 40 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. అలాగే పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన ప్రతిపాదనల మేరకు 8 పరిశ్రమలకు రూ. 64.14 లక్షల మేర ప్రోత్సాహకాలు మంజూరు చేయడానికి ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా 8 యూనిట్లకు పెట్టుబడి సబ్సిడీకి కూడా ఆమోదం ఇచ్చినట్లు తెలిపారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షిస్తూ, ప్రింటింగ్ క్లస్టర్ (తిరుపతి), కలంకారీ క్లస్టర్ (శ్రీకాళహస్తి), నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్ (తిరుపతి) ఏర్పాటుకు చేపట్టిన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు వివరించగా, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ మరియు ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్‌కు రాష్ట్ర స్థాయి ఆమోదం లభించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీఐఐసీ ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయని, ఇంకా ప్రారంభం కాని పరిశ్రమలను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, ఆర్టీఓ మురళీమోహన్, కార్మిక శాఖ అధికారి చిన్నలాలప్ప, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

- మౌలిక వసతులు, రోడ్లు, సేవలపై దిశానిర్దేశం
- శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి జిల్లాలో ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్, తుడా పరిధిలో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధి దీపాల వంటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఐఐసి అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా కఠిన పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల ఫిర్యాదులను నిర్దేశిత గడువుల్లో పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు బాధ్యతతో స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ శాఖకు ఆదేశించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జి మునిసిపల్ కమిషనర్ శారదాదేవి, పంచాయతీ అధికారి సుశీలాదేవి, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, ఏపీఐఐసి జోన్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి, డీఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, ఆర్ అండ్ బి ఎస్.ఈ రాజా నాయక్, సివిల్ సప్లై అధికారి రాజు, ఇరిగేషన్ డీఈ రాధాకృష్ణ, గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, ఉద్యాన శాఖ అధికారి శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 423 అర్జీలు

- అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలి
- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 25:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా వచ్చిన అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా విని అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేసిన జాయింట్ కలెక్టర్, పెండింగ్ లేకుండా, బియాండ్ ఎస్ఎల్ఏ (ఎస్ఎల్ఎ) పరిస్థితి రాకుండా అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన శాఖలపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివ శంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్‌మండ్ తదితరులతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసి సిబ్బంది వెంటనే రసీదులు అందించారు.



**శాఖల వారీగా వచ్చిన అర్జీలు – మొత్తం 423 :** రెవెన్యూ (246), సర్ఫ్ (21), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (17), పోలీస్ (18), పంచాయతీరాజ్ (24), పీఆర్ ఇంజినీరింగ్ (5), ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (2), రిజిస్ట్రేషన్ ‌ స్టాంప్స్ (1), సర్వే ‌ ల్యాండ్ రికార్డ్స్ (16), మైన్స్ ‌ జియా లజీ (5), రూరల్ డెవలప్మెంట్ (6), ఎస్సి ఎస్డబ్ల్యు (2), విద్యుత్ (7), ఏపీఎస్ఆర్టీసీ (1), పౌర సరఫరాలు (3), తుడా (1), గ్రౌండ్ వాటర్ (1), స్కూల్ ఎడ్యుకేషన్ (9), రెసిడెన్షియల్ స్కూల్స్ (9), నీటి వనరులు (9), ఆర్ అండ్ బి (1), ఎక్సైజ్ (1), ఉద్యాన శాఖ (2), ఎల్ డి ఎం (1), అటవీ శాఖ (3), వికలాంగుల శాఖ (1), కుటుంబ సంక్షేమం (2), జాతీయ రహదారులు (1), ఉన్నత విద్య (1), కార్మిక శాఖ (1), పౌర సరఫరా కార్పొరేషన్ (1), పశుసంవర్ధక శాఖ (1), వ్యవసాయ శాఖ (1), దేవాదాయ శాఖ (2), సమగ్ర శిక్ష (1) అర్జీలు నమోదయ్యాయి. సంబంధిత శాఖాధికారులు ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.


# శాప్ చైర్మన్ రవి నాయుడు జన్మదినం

**- సందర్భంగా అల్పాహారం పంపిణీ: కొట్టే హేమంత్ రాయల్**



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 25:** సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవి నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని యం.ఆర్. పల్లి వైకుంఠపురం ఆర్చ్ నందు శ్రామికులు, కూలీలకు అల్పాహార పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో అనిమిని రవి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 500 మంది శ్రామికులకు స్వయంగా అల్పాహారం అందించారు. ప్రతిరోజూ కష్టపడి జీవనం సాగించే శ్రామికులు, కార్మికులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ పేద ప్రజలకు తోడుగా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. కార్యక్రమ ప్రాంగణంలో సేవా స్ఫూర్తి, జన్మదిన వేడుకల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# జెల్లీ మనోహర్ పై తెలంగాణ చందానగర్‌లో కేసు నమోదు



Hill Park
Gardenia,
Chandanagar

City/District RANGA REDDY State TELANGANA PIN

7. Details of known/suspected/unknown accused with full particulars:

Serial No : 1
a) Name Jally Manohar
b) Father's /Husband's Name
c) Occupation d) Caste e) Gender Male
f) Age Nationality India
g) Address

**పుంగనూరు – ఆంధ్రనాడు, మే 25:** పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ బోయకొండ గంగమ్మ దేవస్థానం చైర్మన్ ఎస్.కె వెంకటరమణా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నా వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తూ ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం జల్లి మనోహర్ కు దాదాపు రెండు కోట్ల రూపాయలను అతని ఖాతాలోకి జమ చేయడం జరిగిందని, అది అలుసుగా తీసుకొని తన సొంత వ్యాపారం చేసుకుంటూ నన్ను మోసం చేసి తను నా డబ్బులు వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టి లాభాలు గడిస్తూ తన సొంత ఖాతాలోకి మళ్ళించుకుని నాకు మోసం చేశాడని నేను జల్లి మనోహర్ పై తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ చందానగర్ పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు పెట్టానని అతని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు, జల్లి మనోహర్ పై ఎస్.కె రమణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు పూర్తి వివరాలు సేకరించి జల్లి మనోహర్ కుమారుడు జల్లి చరణ్ కుమార్ పై కూడా చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగింది చందానగర్ పోలీసులు జల్లి మనోహర్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించి వెంటనే పోలీస్ స్టేషన్లో హాజరుకావాలని అట్లు రానిపక్షంలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తీసుకురావాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించినట్లు ఎస్కే రమణారెడ్డి మీడియాకు తెలిపారు, ఇప్పటికైనా నన్ను మోసగించి తీసుకున్న నా డబ్బును చెల్లించేంతవరకు వదిలిపెట్టనని హెచ్చరించారు.

## పుంగనూరు రాజు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సుదర్శన్ రాజు, సుజన్ రాజు లకు జన్మదిన వేడుకలు





**పుంగనూరు – ఆంధ్రనాడు, మే 25 :** పుంగనూరు నియోజకవర్గ రాజు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పుంగనూరు పట్టణం ఎన్టీఆర్ సర్కిల్ నందు చౌడేపల్లి మండలం వా స్తవ్యులు బెంగళూరులో ప్రముఖ పరిశ్రామిక వేత్త సుదర్శన్ రాజు, సుజన్ రాజుల జ న్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పుంగనూరు చౌడేపల్లి ప్రాంతాలలో జన్మదిన కార్యక్రమాలు నిర్వహించారు, సందర్భంగా అన్నదాన కార్యక్ర మం నిర్వహించి, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పాలు పంపిణీ చేశారు రాజు క్షత్రియ సంఘం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి బెంగళూరు మహానగరంలో ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగిన పుట్టిన ఊరును మరువకుండా గ్రామాలలో నిరు ద్యోగ యువతకు ఉద్యోగం, నిరు పేదలకు నిత్యావసర వస్తువులు అందించడం, విద్య వైద్య సేవలు ఇలా పలురకాలు సేవ కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలి చారని కొనియాడారు ఈ రోజు వారి జన్మదిన వేడుకలకు పట్టణం లోని ఎన్ టి ఆర్ సర్కిల్, అనాధ శ్రమలలో అన్నదాన కార్యక్రమం తో పాటు ప్రభుత్వ ఆసుపత్రి రోగుల కు బ్రేడ్, పండ్లు పంపిణి నిర్వహించడం జరిగిందన్నారు, అలాగే శ్రీ వెంకటేశ్వర స్వా మి అశీసులు వారికి వారి కుటుంబ సభ్యులకు ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదటి కార్పొరేషన్ డైరెక్టర్ మనీమొదలియార్, అర్జున్‌రాజు, నవీన్‌రాజు, చంద్ర శేఖర్‌రాజు, లక్ష్మణ్‌రాజు, సతీష్ కుమార్ రాజు, భార్గవ్, మనీ తదితరులు పాల్గొన్నారు

# ఔషధ మొక్కలతో మెరుగైన వైద్యం : సీఈవో ఆవుల చంద్రశేఖర్





**చిత్తూరు – ఆంధ్రనాడు, మే 25:** ఔషధ మొక్కలతో కూడా మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఏపీ ఔషధ మొక్కలు, సుగంధద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ అన్నారు. పలు వ్యాధుల నియంత్రణకు ప్రకృతి మందులు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. చిత్తూరులో సోమవారం శ్రీ వెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. జ్యోతేశ్వరి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ, నర్సింగ్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ సి. రాధిక, డాక్టర్ ఎస్. ఫిరోజ్, ఏపీఎంఏపీ మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్, ఆగ్రో టెక్నాలజీ నిపుణులు విజయకుమార్, కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన ఐదుగురు విద్యార్థులు, అధ్యాపకులకు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రశంస పత్రాలను అందజేసి సత్కరించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బోర్డు సీఈవో ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రాచీన సాంప్రదాయ వైద్యం ద్వారా అనేక రకాల వ్యాధులను నయం చేయవచ్చన్నారు. ప్రకృతి ప్రసాదించే వన మూలికలతో పాటు, ఔషధ సుగంధ మొక్కలతో మెరుగైన వైద్యం సాధ్యమన్నారు. విద్యాలయ ప్రాంగణాలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఔషద మొక్కలు సాగుచేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఇస్తుందన్నారు. ముఖ్యంగా తులసి, అలోవెరా (కలబంద), అశ్వగంధ వంటి మూలికలు సాగుకు అనుకూలమన్నారు. నీరు నిలవని నేలలు, సేంద్రియ ఎరువులు, క్రమబద్ధమైన నీటిపారుదల, మార్కెటింగ్ పరిజ్ఞానం ద్వారా ఈ సాగులో అద్భుతమైన ఫలితాలను పొందవచ్చన్నారు. ముఖ్యమైన ఔషధ మొక్కల పెంపకం సాగు విధానాన్ని ఆయన వివరించారు. నీరు నిలవని నేలలు ఔషధ మొక్కల సాగుకు ఎంతో అనుకూలమన్నారు. తులసి, అశ్వగంధ, అలోవెరా, వేప, నేలవాము, రణపాల, అమృతవల్లి (తిప్పతీగ), వస, కిత్తనార వంటివి వున్నాయన్నారు. నీటి సౌకర్యం ఉంటే ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆకుకూరల తరహాలో నీరు అందించాలన్నారు. నేరుగా విత్తనాలు చల్లడం లేదా కొమ్మల ద్వారా మొక్కలను పెంచవచ్చన్నారు. పోషణకు సేంద్రియ పద్ధతులు, కంపోస్ట్ ఎరువులు నేల సారాన్ని, మొక్క ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. అశ్వగంధ, పసుపు, అల్లం, కలబంద వంటి వాటికి మంచి మార్కెట్ వుందన్నారు. ఔషధ మొక్కల సాగుతో అనేక లాభాలున్నాయన్నారు. స్వల్ప పెట్టుబడితో, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. చాలా మొక్కలు తక్కువ నీటితో, కరువు పరిస్థితులను తట్టుకుని పెరుగుతాయని వివరించారు. ఈ మొక్కలను ఆయుర్వేద, యూనానీ, అల్లోపతి మందుల తయారీలో ఉపయోగిస్తారన్నారు. ప్రభుత్వాల నుంచి జాతీయ, రాష్ట్ర మెడిసినల్ ప్లాంట్స్ బోర్డ్ ద్వారా సాగుకు అవసరమైన ప్రోత్సాహం అందుతుందన్నారు. ప్రత్యేక శిక్షణ కూడా పొందవచ్చన్నారు. ఔషదమొక్కలు పెంచేటప్పుడు నాణ్యమైన విత్తనాలు, ఆరోగ్యకరమైన మొక్కలను ఎంచుకోవాలన్నారు. మొక్కల సాగు, కోత సమయాల్లో అవగాహన ఉండాలన్నారు. సేంద్రియ పద్ధతులను పాటించడం వల్ల నేల సారం పెరుగుతుందన్నారు.

# ఘనంగా రవి నాయుడు జన్మదిన సంబరాలు

**- రాష్ట్రం నలుమూలల నుంచి వెల్లువెత్తిన అభినందనలు**
**- తిరుపతిలో మిన్నంటిన రవి నాయుడు జన్మదిన సంబరాలు.**



**తిరుపతి (ఎస్వీయూ) ఆంధ్రనాడు, మే 25:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీ అనిమిని రవి నాయుడు జన్మదిన సంబరాలు కనుల పండగ జరిగినాయి. నగరంలో నలుమూలల శ్రేయోభిలాషులు, అనుచరుల జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు తో నిండిపోయింది. శ్రేయోభిలాషులు రుయా హాస్పిటల్ వద్ద, ఎంఆర్ పల్లిలో, గాంధీ రోడ్డు నాలుగు కాళ్ల మండపం వద్ద అన్నదానం, మజ్జిగ విత్తరన నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మాల వేసి ప్రారంభించిన కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటల వరకు జన్మదిన సంబరాలు కొనసాగాయి. జన్మదిన సందర్భంగా ఆయన శ్రేయోభిలాషులు తిరుపతిలో తిమ్మినాయుడు పాలెం వద్ద ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల ప్రాంగణంకూ ఆయనకూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి అతిరథ మహారథులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు విచ్చేసారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, పాశం సునీల్ కుమార్, గురజాల జగన్మోహన్ రెడ్డి, డా. కలికిరి మురళి, కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ జోనల్ ఇంచార్జ్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీలు కళ్యాణ్ చక్రవర్తి, రాంగోపాల్ రెడ్డి, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పనబాక లక్ష్మి, డాలర్ దివాకర్ రెడ్డి, షణ్ముఖ రెడ్డి, సునీల్ కుమార్ చౌదరి, సుగవాసి ప్రసాద్ రావు, యాదవ్ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహ యాదవ్, గ్రామీణ ఖాదీ కోపరేషన్ చైర్మన్ కె కె చౌదరి, తితిదే సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి, తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, సత్యవేడు ఇంచార్జ్ శంకర్ రెడ్డి, పుంగనూరు ఇంచార్జ్ చల్లా బాబు రెడ్డి, ఎస్వి యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కాణిపాకం దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, ఎస్వియు కోఆర్డినేటర్లు డా పాకనాటి హరికృష్ణ, డా పత్తిపాటి విజయ్, తానికొండ రంజిత్ కుమార్, ధనంజయ నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ హేమంత్ రాయల్, మాలేపాటి మధు చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి



మోహన్ రెడ్డి మాట్లాడుతూ... పండుగను శాంతిభద్రతల

**పలమనేరు – ఆంధ్రనాడు, మే 25 :** బక్రీద్ పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పలమనేరు అర్బన్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదేశాల మేరకు, పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం పలమనేరు పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కు ఎలాంటి విఘాతం కలగకుండా, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. పట్టణంలో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా ప్రసాద వితరణ - దాతకు సన్మానం



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 25 :** స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దాత ఏ ఎస్ఆర్ టమోటా మండి సులోచన శంకర్ సౌజన్యంతో స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన వందలాది మంది భక్తులకు దాతల సహకారంతో ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రసాద వితరణ ధాతను ఆలయ చైర్మన్ మురళీ కృష్ణ, వైస్ చైర్మన్ మంజునాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అర్చకులు కుమార్, చంద్రమౌళి గురుకుల్ వేద ఆశీర్వ చనాలతో, కమిటీ సభ్యులు శాలువా కప్పి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంటిఆర్ ప్రసాద్, రెడ్డప్ప, బాబు, వీరప్పతో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# డిపోలో ఆన్ కాల్ డ్రైవర్ల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 25:** పలమనేరు ఆర్టీసీ డిపో నందు ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేయుటకు ఆసక్తి మరియు అర్హత కలిగిన డ్రైవర్ల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు డిపో మేనేజర్ అల్తాఫ్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హెవీ వాహనాలు నడపడంలో కనీసం 18 నెలల అనుభవం ఉండాలి. అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలి. పైన పేర్కొన్న అర్హతలు కలిగి, ఆసక్తి ఉన్న డ్రైవర్లు వెంటనే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పలమనేరు డిపో నందు సంప్రదించాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు కింది నెంబర్లు 7780381188, 7382877995 సంప్రదించలన్నారు.

# రాష్ట్ర శాప్ చైర్మన్ రవి నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోహన మురళి



**వెదురుకుప్పం– ఆంధ్రనాడు, మే 25:** రాష్ట్ర శాప్ చైర్మన్ రవి నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని మండల పార్టీ అధ్యక్షుడు మోహన మురళీ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా మోహన మురళీ మాట్లాడుతూ రవినాయుడు రాజకీయంగా మరిన్ని ఉన్నత పదువులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి చెంగలరాయిరెడ్డి, కొత్త చంద్రశేఖర్ నాయుడు, ఏఎంసి డైరెక్టర్ వరప్రసాద్ ఏఎంసి డైరెక్టర్ బాలాజీ రెడ్డి మండల బీసీ సెల్ మాజీ అధ్యక్షులు తులసిరామ్ యాదవ్ టిడిపి సీనియర్ నాయకుడు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# ఫైనల్ కు చేరేదెవరో..?


## - నేడు బెంగళూరు వి గుజరాత్ మధ్య క్వాలిఫయర్-1 మ్యాచ్
## - రాత్రి 7.30గంటల నుంచి



ధర్మశాల: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-19 ఫైనల్ కు చేరే జట్టేదో మరి గంటల్లో తేలిపోనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ), 2022 ఛాంపియన్ గుజరాత్ టైటన్స్ జట్ల మధ్య హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాల వేదికగా తొలి క్వాలిఫయర్-1 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్ కు చేరుకోనుండగా.. ఓడిన జట్టుకు మరో ఛాన్స్ దక్కనుంది. 2026 సీజన్ టాప్-2 జట్ల మధ్య తొలి క్వాలిఫయర్ మ్యాచ్ జరగనుంది. ఈ సీజన్ లో బెంగళూరు, గుజరాత్ తో పాటు సన్ రైజర్స్ జట్టు కూడా 9 విజయాలతో సహా 18 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన రన్ రేట్ తో బెంగళూరు, గుజరాత్ జట్లు టాప్-2 స్థానాల్లో నిలిచి క్వాలిఫయర్-1కు అర్హత సాధించాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు రన్ రేట్ లో వెనుకబడి 3వ స్థానానికి పరిమితమైంది. బుధవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ లో సన్ రైజర్స్ జట్టు రాజస్తాన్ రాయల్స్ తో తలపడనుంది. ఈ మ్యాచ్ న్యూ ఛండీగఢ్ వేదికగా జరగనుంది.

టోర్నీ ప్రారంభం నుంచి డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు టాప్ ఫామ్ ను కొనసాగిస్తూ వచ్చింది. ఆడిన ప్రతి మ్యాచ్ లోనూ ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తూ విజయాలను నమోదు చేసుకొంది. మరోవైపు గుజరాత్ టోర్నీ ఆరంభ మ్యాచుల్లో నిరాశపరిచినా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొంది. ప్రారంభంలో పంజాబ్, రాజస్తాన్ చేతిలో ఓడిన గుజరాత్.. ఆ తర్వాత హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసుకొన్నా.. ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచుల్లో ఓడి తొలి అర్ధభాగం 7 మ్యాచ్ లు ముగిసేసరికి కేవలం 3 విజయాలు, 4 పరాజయాలతో 8వ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత గుజరాత్ పుంజుకున్న అత్యద్భుతం. ఆ తర్వాత గుజరాత్ ఆడిన 5 మ్యాచుల్లోనూ గెలిచి ఏకంగా ప్లే-ఆఫ్స్ బెర్త్ కొట్టేసింది. లీగ్ దశలో ఇరుజట్లు ముఖాముఖి తలపడగా.. ఇరుజట్లు ఒక్కో మ్యాచ్ లో గెలిచాయి. తొలి మ్యాచ్ లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గుజరాత్ ను చిత్తుచేయగా.. రెండో లీగ్ మ్యాచ్ లో గుజరాత్ జట్టు 4 వికెట్ల తేడాతో ఆర్సీబీని ఓడించింది.

ఐపిఎల్ చరిత్రలో ముంబయి, చెన్నై జట్లదే హవా. ఇప్పటివరకు జరిగిన 18 సీజన్ లలో ఈ రెండు జట్లు ఏకంగా 10 టైటిళ్లను కైవసం చేసుకున్నాయి. ఈసారి ఆ రెండు జట్లు ప్లే-ఆఫ్స్ కు చేరడంలో విఫలమయ్యాయి. దీంతో సీజన్-19 టైటిల్ ను మరో జట్టు కైవసం చేసుకోనుంది. 2022 నుంచి ఐపిఎల్ ను 10 జట్ల కు విస్తరించిన తర్వాత ముంబయి, చెన్నై జట్ల టైటిళ్ల వేటకు కొంత గండి పడింది. ఈ నాలుగు సీజన్లలో 4 వేర్వేరు జట్లు టైటిళ్లను కైవసం చేసుకున్నాయి2022లో గుజరాత్, 2023లో చెన్నై, 2024లో కోల్ కతా, 2025లో ఆర్సీబీ జట్లు టైటిళ్లను కైవసం చేసుకున్నాయి. ఈ సీజన్ ప్లే-ఆఫ్స్ కు చేరిన 4జట్లు ఒక్కోసారి టైటిల్ ను ముద్దాడాయి. 2026 సీజన్ టైటిల్ ను ఏ జట్టు కైవసం చేసుకున్నా.. రెండోసారి టైటిల్ ను కొట్టేయడం ఖాయం.




# ఎంతో ఓర్పు ప్రదర్శించావు.. ఆటను ప్రేమిస్తూనే ఉండు

## - అర్జున్ పై సచిన్ పోస్ట్

క్రీడలు : భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఐపిఎల్ 2026 సీజన్‌లో తొలి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున చివరి లీగ్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన అర్జున్, బ్యాటింగ్‌లో ఎనిమిదో స్థానంలో వచ్చి 5 బంతుల్లో 5 పరుగులు చేశారు. బౌలింగ్‌లో నాలుగు ఓవర్లు వేసి 36 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నారు. జట్టులోని ఇతర బౌలర్లతో పోలిస్తే అతడి ఎకానమీ రేట్ మెరుగ్గా ఉండటం విశేషం.

"వెల్‌డన్ అర్జున్. ఈ సీజన్‌లో నువ్వు వ్యవహరించిన తీరు పట్ల గర్వంగా ఉంది. నీ సామర్థ్యంపై నమ్మకముంది. అలాగే ఎంతో ఓర్పు ప్రదర్శించావు. చాలా కష్టపడ్డావు. తొలి అవకాశం కోసం వేచి చూశావు. క్రికెట్ కేవలం నైపుణ్యాన్ని మాత్రమే కాదు సహనాన్నీ పరీక్షిస్తుంది. నువ్వు అద్భుతంగా హ్యాండిల్ చేశావు. ఎప్పుడూ వినయంగా ఉండు. ఆటను ప్రేమిస్తూనే ఉండు. మేమంతా నిన్ను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాం" అని సచిన్ పోస్టు చేశారు.

మ్యాచ్‌లో అర్జున్ తన తొలి ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేసే అవకాశం సృష్టించారు. షార్ట్ డెలివరీకి వచ్చిన క్యాచ్‌ను కెప్టెన్ రిషభ్ పంత్ వదిలేయడంతో వికెట్ చేజారింది. అయితే తర్వాత అదే ప్రభ్‌సిమ్రన్‌ను ఎల్బీగా అర్జున్ ఔట్ చేశారు. ఇక భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా అర్జున్‌పై ప్రశంసలు కురిపించారు. "అర్జున్ ప్రతిభ గురించి కాకుండా అతడి మానసిక ధైర్యం గురించి చెప్పాలి. తండ్రి స్థాయితో పోల్చితే అతడికి అవకాశాలు తక్కువగా వచ్చాయి. అయినప్పటికీ ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ఒక ఓవర్‌లో బౌండరీలు ఇచ్చినా కూడా ధైర్యంగా తిరిగి బంతి

# 28న 'బ్లాస్ట్ జోన్' విడుదల

## - మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రం 'బ్లాస్ట్ జోన్' : యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా, ప్రీతి ముకుందన్, అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్లాస్ట్ జోన్' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేస్తోంది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించడం విశేషం. మే 28న ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, సోమవారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది.

ఈ సందర్భంగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా మాట్లాడుతూ.. "అందరికీ హృదయకపూర్వక నమస్కారాలు. ఈ 'బ్లాస్ట్ జోన్' సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది. సినిమా పూర్తయిన తర్వాత అవుట్ పుట్ చూసుకొని సంతృప్తి చెందే సినిమాలు కొన్ని ఉన్నాయి. అలాంటి సినిమా 'బ్లాస్ట్ జోన్'. మన తల్లిదండ్రులకో, మన వాళ్ళకో అన్యాయం జరిగితే న్యాయం కోసం మనం ఖచ్చితంగా పోరాడతాం. అయితే ఈ సమాజంలో ఎవరికి అన్యాయం జరిగినా పోరాడాలి అనే సందేశాన్ని ఈ సినిమా చెబుతుంది. ఎవరో వచ్చి మనల్ని కాపాడతారు అని ఎదురు చూడకుండా, మనల్ని మనం కాపాడుకోవడానికి ఏం చేయాలి? తల్లిదండ్రులుగా ఆడబిడ్డల్లో ధైర్యాన్ని ఎలా నింపాలి? వంటి అద్భుతమైన అంశాలు ఇందులో ఉంటాయి. నేను ఎన్నో సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు చేశాను. కానీ, ఈ సినిమాలో అభిరామి, ప్రీతి ముకుందన్ నాకంటే బాగా ఫైట్లు చేశారు. ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొంది, ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. 'బ్లాస్ట్ జోన్' సినిమాలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. రవి బస్రూర్ గారు అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు. నేపథ్య సంగీతం కోసం ఏకంగా 40-45 రోజులు కేటాయించారు. సాంకేతికంగా ప్రతి విభాగం అద్భుతంగా పని చేసింది. విజువల్స్ బాగుంటాయి. ఫైట్స్ చాలా కొత్తగా ఉంటాయి. ఈ సినిమాలో నా పాత్ర ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా మా సుభాష్ కె రాజ్ వయసులో చాలా చిన్నవాడు కానీ, గొప్పగా సినిమాను తెరకెక్కించాడు. ఇది విభిన్నమైన చిత్రం. మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది. తమిళంలో అగ్ర నిర్మాణ సంస్థ ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ మా సినిమాను నిర్మించడం గర్వంగా ఉంది. అలాగే తెలుగులో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా నాగవంశీ గారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది. ఇది మీకు డబ్బింగ్ సినిమాలా అనిపించదు. ప్రతి పాత్ర మీకు కనెక్ట్ అవుతుంది. ఇది మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రం 'బ్లాస్ట్ జోన్'. ఈ సినిమాను మీరందరూ మే 28న థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయండి." అన్నారు.

దర్శకుడు సుభాష్ కె రాజ్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. ముందుగా నన్ను, నా కథను నమ్మి నాకు ఈ అవకాశమిచ్చిన నిర్మాత అఘోరం గారికి ధన్యవాదాలు. ఈ సినిమాలో మీరు వింటేజ్ అర్జున్ గారిని చూస్తారు. తమిళ్ లాగానే తెలుగులో కూడా అర్జున్ గారికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ సినిమా అర్జున్ గారి అభిమానులకు ఒక ట్రీట్ లా ఉంటుంది. ప్రీతి ముకుందన్ గారు, అభిరామి గారు అద్భుతంగా నటించారు. ఈ సినిమాను నమ్మి, తెలుగులో విడుదల చేస్తున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ గారికి కృతజ్ఞతలు. 'బ్లాస్ట్ జోన్' ట్రైలర్ కింద నేను కామెంట్స్ చూశాను. మీ అందరికీ ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయని అర్థమైంది. మీ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది. 'బ్లాస్ట్ జోన్' సినిమా మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. ఇందులోని ప్రతి పాత్ర మీకు కనెక్ట్ అవుతుంది." అన్నారు.మా సినిమాకు మీడియా నుంచి లభిస్తున్న మద్దతుకు ధన్యవాదాలు. మీరందరూ మా సినిమాను చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను." అన్నారు.




# తెరపై 'ఆట'.. విజయాల బాట..

## 'ఆటనుకోకొయ్... ఆటంటే బతుకోయ్.. నీ ఆట బతకాలిరోయ్.. మాటనుకోకొయ్... గెలుపంటే వెలుగోయ్...

గెలుపై నువ్వు వెలగాలిరోయ్... మండే గుండె నీలో లేదంటే...' అంటూ సాగే పాట జూన్ 4న విడుదలకాబోయే 'పెద్ది' సినిమాలోది.

'ఒకటే జననం, ఒకటే మరణం.. గెలుపు పొందే వరకూ అలుపు లేదు మనకు...
బ్రతుకే లాంటి గెలుపూ... గెలుపు కొరకే బ్రతుకు' అంటూ సాగే పాట 'భద్రాచలం' సినిమాలోనిది.
'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి... ఆడితే ఆడాలిరా రప్పాడించాలి...పోటీ ఏదైనా గానీ
గెలుపొందితీరాలి' అంటూ సాగే పాట 'ఠాగూర్' సినిమాలోనిది..... ఇలా చెప్పుకుంటూ పోతే, సినిమాల్లో అనేక ఆటల గొప్పతనాన్ని సాహిత్య ప్రక్రియల ద్వారా చక్కగా ఆవిష్కరించారు. ఇటీవల వచ్చిన 'బైకర్'లోనూ క్రీడల ప్రస్తావన కనిపించింది.

ఓడటం తెలిసినవాడే గెలవడం నేర్చుకుంటాడు. ఆటల్లో ఉంటేనే ఓటమి, గెలుపు, ఓడినా గెలిచినా సాధన కొనసాగించడం తెలుస్తాయి. మనిషిని మానసికంగా, శారీరకంగా తీర్చిదిద్దడంలో ఆటను మించింది లేదు. ఆటలో ఉండే ఉద్వేగం, ఉత్కంఠ కూడా మనిషిని బలంగా ఆకర్షిస్తాయి. క్రీడా నేపథ్య చిత్రాలు తెలుగు తెరకు కొత్త కాదు. మనందరికీ బాగా తెలిసిన క్రికెట్ మొదలుకొని, పెద్దగా పరిచయం లేని రగ్బీ వరకు పలు భిన్నమైన స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులను పలకరించాయి. వాటిలో సింహభాగం విజయాలను సొంతం చేసుకున్నాయి. కానీ, ఒకే సినిమాలో పలు భిన్నమైన క్రీడలను స్పృశిస్తూ ముస్తాబైన క్రీడా నేపథ్య చిత్రాలు మాత్రం అరుదనే చెప్పాలి. ఇప్పుడా లోటును 'పెద్ది'తో తీర్చబోతున్నారు కథానాయకుడు రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సాన. 'ఉప్పెన' విజయం తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రమిది. క్రికెట్, కుస్తీ, రన్నింగ్ లాంటి ఆటలతో ముడిపడిన ఆసక్తికర కథతో ఈ చిత్రాన్ని సిద్ధం చేశారు. ఉత్తరాంధ్ర నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాలో చరణ్ ఆటకూలీగా అందర్నీ ఆశ్చర్యపరచనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు, అందులో చరణ్ ఆడిన క్రికెట్ షాట్లు విశేష ఆదరణ దక్కించుకున్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గానూ, కుస్తీ యోధుడిగానూ కనిపిస్తారు. అచ్చం ఉత్తరాంధ్ర కళింగ యాసలో ఈ సినిమా పూర్తిగా సాగనుంది. సినిమాలో ఆట అనేది కేవలం ఆటకే పరిమితం కాదు; అది జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, దేశభక్తిని చాటిచెప్పడం వంటి అంశాలతో ముడిపడి సాగింది. వెండితెరపై ఆటస్థలాన్ని కూడా ప్రధానంగా చూపించిన తెలుగు సినిమాల గురించి తెలుసుకుందాం.

## నేడు గంటాఊరు గంగమ్మ
# అమ్మవారి విశ్వరూప దర్శనం

### - ముగిసిన అమ్మవారి శిరస్సు ఊరేగింపు

**పలమనేరు– ఆంధ్రనాడు, మే 25**



పట్టణ సమీపంలోని గంటావూరు బీసీ కాలనీ లో వెలసిన ప్రసిద్ధ శ్రీ తిరుపతి గంగమ్మ జాతర మహోత్సవాలలో భాగంగా సోమవారం అర్ధరాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు కార్యక్రమం బ్రహ్మాండంగా నిర్వహిశీచారు. అర్ధ రాత్రి 12.00 గంటలకు అమ్మవారి శిరస్సుకు ఆలయ చైర్మన్ డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శిరస్సు మెరవని కార్యక్రమం ఘనంగా చేపట్టారు.విశేషంగా మొక్కు బడులు తీర్చుకొనే భక్తులు వేలాది టెంకాయలు కొట్టారు.పిదప అమ్మవారు మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకొన్నారు.ఆ పాటికే అమ్మవారు విశ్వరూపంలో దర్శనం ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు.
నేడు ఉదయం ఐదు గంటలు ప్రాంతం నుంచి అమ్మవారు ఆలయం వద్ద విశ్వరూపంగా కొలువై భక్తులకు దర్శనం ఇస్తున్నారు.ఇందులకు గాను అమ్మవారి ఆలయం ఎదుట ఈ పాటికే చలువ పందిళ్ళ వేసి సిద్ధం చేసారు.వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ఆలయ కమిటీతో పాటు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పీ దేగల ప్రభాకర్ పర్యవేక్షణతో సిఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ భద్రతా చర్యలు తీసుకొంటున్నారు.

**రేపు జలిదీ కార్యక్రమం**

పిదప అమ్మవారికి(శిరస్సు)
బుధవారం ఉదయం జలిది కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.జాతర సందర్భంగా గంటావూరు బీసీ కాలనీలో ఇంటిల్లి పాదీ బంధు మిత్రులతో ఈ పాటికే కిటకిట లాడుతున్నది.

**నూతన శిరస్సుతో భక్తులకు దర్శనం**

ఈ ఏడాది అమ్మవారి శిరస్సును నూతనంగా పంచలోహ విగ్రహంతో ప్రత్యేకంగా తయారు చేయించడంతో అత్యంత ఆకర్షనీయంగా భక్తులకు కనువిందు చేస్తుండడం విశేషం.

# ప్రజా మౌళిక అవసరాల లక్ష్యమే ప్రభుత్వ ధ్యేయం

**- అమృత్ పథకం ద్వారా పట్టణ అభివృద్ధికి రూ. 16.5 కోట్లు మంజూరు**
**- పనుల్లో నాణ్యత... రాజీ పడొద్దని కాంట్రాక్టర్ కు సూచించిన ఎమ్మెల్యే**

**పలమనేరు– ఆంధ్రనాడు, మే 25 :** పలమనేరు పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమృత్ పథకం కింద వాటర్ సప్లై కొరకు పలమనేరు మున్సిపాలిటీకి రూ.14.30 కోట్ల నిధులు, స్వచ్ఛభారత్ ద్వారా బ్యూటిఫికేషన్ కొరకు రూ. 2.2 కోట్లు మొత్తం రూ. 16.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు, నీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.
ఈ మేరకు టెండర్ దక్కించుకున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు , పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు మరియు సంస్థ సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.అమృత్ పథకం రూ.14.30 కింద చేపట్టనున్న ముఖ్యమైన పనుల్లో ట్యాంకుల నిర్మాణం,పైప్ లైన్ పనులు ఉండగా, స్వచ్ఛ భారత్ ద్వారా పలమనేరు పెద్ద చెరువు బ్యూటీఫికేషన్‌కు రూ.2.5 కోట్లు కేటాయించగా, గంటావూరులో 4.5 లక్షల కిలోలీటర్ల సామర్థ్యంతో భారీ నీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే గడ్డూరులో 3 లక్షల కేఎల్ సామర్థ్యంతో మరో ట్యాంక్, పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో 2.5 లక్షల కేఎల్ కెపాసిటీతో నీటి నిల్వ ట్యాంక్ నిర్మాణం జరగనుంది. అదనంగా పట్టణ పరిధిలో పాత



పైప్‌లైన్ల మరమ్మతులు, కొత్త పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు వంటి పనులు కూడా చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే పలమనేరు పట్టణంలో తాగునీటి సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరగనుంది. పెద్ద చెరువు అభివృద్ధితో పట్టణ సౌందర్యం మరింత ఆకర్షణీయంగా మారనుండగా, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. పట్టణ అభివృద్ధి, ప్రజల మౌలిక అవసరాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సంస్థకు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ సువి రావ్, జిల్లా ప్రజా ఆరోగ్య శాఖ సాంకేతిక అధికారి నాయక్ తో పాటు మున్సిపల్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తిని గ్రామస్థాయిలో తీసుకెళ్దాం


### - వర్చువల్ విధానంలో మహానాడును జయప్రదం చేయాలి



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 25**

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు సూచనలతో ఇంధన పొదుపు చర్యల్లోభాగంగా వర్చువల్ విధానంలో మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నామని రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి పేర్కొన్నారు రామకుప్పంలో ని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ సమీపంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు ప్రతి క్లస్టర్ పరిధిలో ఒక కేంద్ర ప్రదేశాన్ని ఎంపిక చేసి అక్కడ ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేసి మహానాడు ప్రధాన కార్యక్రమాన్ని జూమ్ కాల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసే విధంగా ఏర్పాటు చేయాలని తీర్మానించారు తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త ఈ మహానాడును సొంత కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అలాగే పార్టీ సిద్ధాంతాలు నాయకత్వ సందేశాలు గ్రామస్థాయికి చేరేలా వర్చువల్ మహానాడుని విజయవంతం చేయాలన్నారు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు అప్పట్లో పేద ప్రజల కోసం కిలో రెండు రూపాయలకు బియ్యం జనతా వస్త్రాలు ఇంకా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు గ్రామస్థాయిలో రాజకీయ చైతన్యం తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీ రామారావు వల్లనే అని అభిప్రాయపడ్డారు ఆయన చేసిన అభివృద్ధి పనులను దేశ స్థాయిలో ఉన్నదన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునుస్వామి, టిడిపి పార్టీ మండలప్రధాన కార్యదర్శి కామ్రాజ్ నాయక్, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి నాగభూషణం రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ సింగిల్ విండో అధ్యక్షులు మొహమ్మద్ రఫీ నాయకులు రామమూర్తి జయశంకర్,చిన్నికృష్ణ పట్టరనారాయణ చలపతి సీతాపతి రామకృష్ణప్ప కృష్ణ నాయక్ టివి రవి మంజునాథ్ బాలు సుబ్రి రామలింగారెడ్డి కృష్ణా నాయక్ మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు






Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733